# ఆయిల్ పామ్ సాగు.. లాభాలు బాగు

- వీణవంక మండలంలో గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణం
- అంతర పంటలతో ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న రైతులు
- విస్తృత అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు


రెడ్డిపల్లిలో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంట

వీణవంక, అక్టోబర్ 1: ప్రభుత్వ తోడ్పాటుతో రైతులు ఇతర పంటలవైపు మొగ్గు చూపుతున్నారు. సంప్రదాయ పంటలకు బదులు ఆయిల్‌పామ్ సాగుతో కలిగే లాభాలపై వ్యవసాయ శాఖ అవగాహన సదస్సులు నిర్వహిస్తుండడంతో ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వం నగదు ప్రోత్సాహకం, రాయితీలు అందిస్తుండడం, దళారుల ప్రమేయం లేకుండా దిగుబడిని నేరుగా విక్రయించుకునే అవకాశం ఉండడంతో ఇప్పటికే మండలంలో వందల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టారు.

మండలంలోని రెడ్డిపల్లి, ఘన్ముక్ల, బొంతుపల్లి, పోతిరెడ్డిపల్లి, వల్భాపూర్, చల్లూరు, ఎలుబాక గ్రామాల్లో రైతులు 182 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు డీడీలు తీయగా ప్రస్తుతం 120 ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటలు సాగులో ఉన్నాయి. ఇక ఇప్పటికే సాగు చేస్తున్న రైతులు పత్తి, వేరుశనగ లాంటి అంతర పంటలు వేసి ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

### ఆయిల్‌పామ్ సాగుతో ప్రయోజనాలు

ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన నాలుగు నుంచి 30 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుండగా, గెలల విక్రయం ద్వారా మంచి ఆదాయం ఉంటుంది. దీనికి తోడు ప్రభుత్వ రాయితీలు లభిస్తాయి. పంట ఫలసాయం మధ్య దళారీలు లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కంపెనీ నేరుగా కొనుగోలు చేస్తుంది. డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయి. ఈ పంటలో చీడపీడల బెడద తక్కువ ఉండగా, అనుభవజ్ఞులైన క్షేత్రస్థాయి సిబ్బంది అందుబాటులో ఉంటూ సాంకేతిక సలహాలు ఇస్తారు. అంతర పంటల ద్వారా సైతం ఆదాయం లభించగా, అర్హత గల రైతులకు బ్యాంకులు హెక్టార్‌కు రూ.1.2 లక్షల వరకు తొమ్మిది సంవత్సరాల గడువుతో రుణ సదుపాయం కల్పిస్తున్నాయి.

### అనుకూల నేలలు.. నీటి లభ్యత

ఆయిల్ పామ్ పంట సాగుకు దాదాపు అన్ని రకాల నేలలు అనుకూలం. నీరు నిలువని ఒండ్రు నేలలు, అధిక సేంద్రియ పదార్థం కలిగి, నీరు తేలికగా ఇంకిపోయే గుణం కలిగి ఉండాలి. సమృద్ధిగా నీరు ఉంటే అధిక దిగుబడి పొందవచ్చు. బోరు బావుల కింద సాగు చేయడం మేలు.

### మొక్కలు నాటే విధానం

సమాంతర పద్ధతిలో ఎటు 2 అడుగుల పరిమాణంతో గుంతలు తీయాలి. నాటేందుకు ముందు ఒక్కొక్క గుంతలో 400 గ్రా.సింగిల్ సూపర్ ఫాస్పేట్ లేదా 200 గ్రా.డీఏపీ, 50 గ్రా.ఫోరేట్ గుళికలు వేసి కలిపిన మట్టితో నింపాలి.

### అంతర పంటలు

ఆయిల్ పామ్ తోటలో మొక్కల మధ్య దూరం ఎక్కువ కనుక తొలి మూడేండ్లలో అంతర పంటలు పండించి ఆదాయం పొందవచ్చు. ఆయిల్ పామ్ తోటల్లో మక్క, అరటి, పొద్దుతిరుగుడు, మిరప, సోయాబీన్, పసుపు, పూలు, పెసలు, మినుము, అలసందలు, నువ్వులు, వేరుశనగ, కూరగాయలు, చందనం అంతర పంటలుగా వేసుకోవచ్చు.

### గెలల దిగుబడి, కోత

గెలల దిగుబడి 3-4 సంవత్సరాల మధ్య ప్రారంభమై 7వ సంవత్సరం నుంచి నిలకడగా అత్యధిక దిగుబడినిచ్చే స్థాయికి చేరుతుంది. హెక్టార్‌కు సగటున 25-30 టన్నుల పామాయిల్ గెలల దిగుబడి వస్తుంది. కొందరు అభ్యుదయ రైతులు సమగ్ర సాగు యాజమాన్య పద్ధతులను సక్రమంగా ఆచరించి హెక్టారుకు 30-40 టన్నుల వరకు దిగుబడి సాధిస్తున్నారు.

### సర్కారు ప్రోత్సాహంతోనే పంట యేసినం



ఏటా వరి, పత్తి వేసెటోన్ని. సర్కారోళ్లు రైతు వేదికల మీటింగ్ పెట్టి ఆయిల్ పామ్ పంట ఎయ్యాలనడంతో నేను మూడు ఎకరాలల్ల ఎకరానికి 57 మొక్కల సొప్పున మొత్తం 171 మొక్కలు నాటిన. ప్రభుత్వం సబ్సిడీ గూడ ఇచ్చింది. ఎకరానికి రూ.42 వందలు బ్యాంక్ ఖాతాల జమచేసింది. ఇప్పటి వరకు పంట యేసి సంవత్సరం అయితంది. పంటకు ఎలాంటి రోగాలు రాకుంట రైతుల వేదికల ఉండే సార్లు అచ్చి ఏఏ మందులు గొట్టాల్నో చెప్తున్రు. వారానికో, పది రోజులకోసారి అచ్చి జూసి పోతన్రు.

*-మూడ సమ్మిరెడ్డి, రైతు(రెడ్డిపల్లి)*

### తోట మధ్యల పత్తి, మక్క ఏసిన



ఆయిల్ పామ్ పంట 4 సంవత్సరాల తరువాత కోతకు అత్తదికావట్టి అంతర పంటలు ఏసుకోవచ్చని అధికారులు చెప్పిన్రు. నేను 4 ఎకరాలల్ల ఆయిల్ పామ్ మొక్కలు నాటిన. వాటి మధ్య కొంత పత్తి, కొంత మక్క ఏసిన. ఆయిల్ పామ్ మొక్కలు నాటి సుమారు 10 నెలలు అయితంది. మొక్కలు మంచిగ పెరిగి, నాలుగు ఆకులు గూడ ఏసినయి. ఆయిల్ పామ్ మొక్కలతో పాటు అంతర పాటు అంతర పంటలు వేయడం వల్ల మంచి లాభాలు అత్తన్నయి.

*- పోతుల నర్సయ్య, రైతు (సర్పంచ్) రెడ్డిపల్లి*

### ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు



రొటీన్‌కు భిన్నంగా రైతులు ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటలు వేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చు. ఒక ఎకరానికి 57 మొక్కలు నాటుకోవచ్చు. ఎకరానికి ప్రభుత్వం రూ.42 వందలు రైతుల ఖాతాలో నగదు ప్రోత్సాహకం జమ చేస్తుంది. ఆసక్తి గల రైతులు ఎకరానికి రూ.1140 చొప్పున డీడీ తీసి స్థానిక క్లస్టర్‌లో అందజేయాలి. 4 సంవత్సరాల తరువాత పంట కోతకు వస్తుంది కాబట్టి రైతులు అంతర పంటలు కూడా వేసుకొని ఆర్థికంగా లాభాలు పొందవచ్చు.

*-చందా రాకేశ్, ఏఈవో(రెడ్డిపల్లి క్లస్టర్)*

# పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు


జమ్మికుంట: చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్పర్సన్ దేశిని స్వప్న


వెన్నేపల్లిలో శ్రమదానంలో పాల్గొన్న సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొండ గణేశ్

జమ్మికుంట, అక్టోబర్ 1: పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, రోగ రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న పిలుపునిచ్చారు. ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలోని 19వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రమదానం చేశారు. వార్డులోని చెత్తాచెదారాన్ని తొలగించారు. తర్వాత ఆమె మాట్లాడుతూ.. చెత్తాచెదారం వల్ల దోమలు పెరుగుతాయని, వీటి వల్ల రోగాలు ప్రబలుతాయని తెలిపారు. ప్రజలంతా చెత్తను మున్సిపల్ అందజేసిన బుట్టల్లోనే వేయాలని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా వాహనాల్లో వేయాలని చెప్పారు. ఇక్కడ వార్డు అధికారి వాణి, జవాన్ కిరణ్, ఆర్పీలు సుజన, ఎండీ భాను, సిబ్బంది, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

### ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో శ్రమదానం

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు కళాశాల ప్రాంగణంలోని చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎంబాడి రవి, లోఖండే రవీందర్ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వలంటీర్లు జీవన్, హరీశ్, మీనాక్షి, ఓంశ్రీ, వాచ్‌మెన్ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

### సైదాపూర్‌లో..

సైదాపూర్, అక్టోబర్ 1: మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాగ్రామాల్లో సర్పంచులు గంట పాటు శ్రమదానం చేశారు. వెన్నేపల్లిలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొండ గణేశ్ రోడ్లు ఊడ్చి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కనుల పండువగా గోవిందా కల్యాణం


దేశాయిపల్లిలో పూజలు చేస్తున్న ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి

వీణవంక, అక్టోబర్ 1: మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో ఆదివారం ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో గోవిందా కల్యాణ మహోత్సవం కనుల పండుగగా జరిగింది. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించిన వేడుకకు గ్రామంలోని భక్తులు తరలివచ్చారు. కల్యాణం అనంతరం స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, గ్రామంలో పాడి పంటలు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని గోవిందా కల్యాణం జరిపించామని తెలిపారు. కార్యక్రమంలో పాకాల సత్యనారాయణరెడ్డి, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

## 'బెస్ట్ సోషల్ లీడర్'గా లింగారెడ్డి


అవార్డు అందుకుంటున్న లింగారెడ్డి

జమ్మికుంట, అక్టోబర్ 1: విద్యాబోధన, పరిశోధనలతో పాటు సామాజిక రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న జమ్మికుంట వాసి, అసిస్టెంట్ ప్రొఫెసర్ కాటిపెల్లి లింగారెడ్డిని బెస్ట్ సోషల్ లీడర్ అవార్డు వరించింది. రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లోని ఇన్స్పిరా రీసెర్చ్ అసోసియేషన్ యూనివర్సిటీ ఆఫ్ రాజస్థాన్(జైపూర్) దేశవ్యాప్తంగా పలు రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వ్యక్తులకు ఏటా బెస్ట్ సోషల్ లీడర్ అవార్డులను ప్రదానం చేస్తున్నది. ఈ యేడాదికి ఇద్దరిని బెస్ట్ సోషల్ లీడర్ అవార్డుకు ఎంపిక చేయగా, అందులో తెలంగాణ నుంచి లింగారెడ్డి ఒకరు కావడం విశేషం. శనివారం జైపూర్‌లో యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ప్రొఫెసర్స్ బీపీ శర్మ, ఎన్‌డీ మాథుర్, ఎస్ఎస్ మోదీ, రవికాంత్ మోదీ, అనిల్ మెహతా బెస్ట్ సోషల్ లీడర్ అవార్డును లింగారెడ్డికి ప్రదానం చేశారు. జమ్మికుంట మండలంలోని మాచినపల్లి గ్రామానికి చెందిన లింగారెడ్డి ప్రస్తుతం హనుమకొండ జిల్లా కేంద్రంలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా, లింగారెడ్డికి అవార్డు రావడంపై కేడీసీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, జమ్మికుంటకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## ఇల్లందకుంట ఆలయంలో యప్‌టీవీ అధినేత ప్రత్యేక పూజలు


యప్‌టీవీ అధినేత పాడి ఉదయ్‌నందన్‌రెడ్డి దంపతులకు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న అర్చకుడు వంశీధరాచార్యులు

ఇల్లందకుంట, అక్టోబర్ 1: మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని యప్‌టీవీ అధినేత పాడి ఉదయ్‌నందన్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శేషం వంశీధరాచార్యులు ఆయనకు స్వామివారి జ్ఞాపిక అందజేశారు. శాలువాలతో సన్మానించారు. ఇక్కడ నాయకులు ఐలయ్య శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సురేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, రాజిరెడ్డి, ఆలయ సిబ్బంది రాజన్న మోహన్, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

## పెద్దపాపయ్యపల్లిలో పద్మశాలీ ఆత్మీయ సమావేశం

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 1: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలో ఆదివారం ప్రముఖ సామాజికవేత్త సబ్బని వెంకట్ పద్మశాలీలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాబోయే ఎన్నికలలో పద్మశాలీల పాత్ర గురించి కులస్తులతో చర్చించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు సంగెం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సంగెం మల్లేశం, ప్రధాన కార్యదర్శి సుంకనపెల్లి రాజేశ్, సహాయ కార్యదర్శి కుసుమ రాజమౌళి, నాయకులు సుంకనపల్లి రాము, సంగెం ధర్మయ్య, బొల్లు కృష్ణమూర్తి, కొక్కుల రవీందర్, సంగెం శ్రీధర్, తలకొక్కుల రవీందర్, సంగెం వెంకటస్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచుల ఫోరం అధ్యక్షుడికి సన్మానం

సైదాపూర్, అక్టోబర్ 1: మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడిగా ఎన్నికైన కొండ గణేశ్‌ను ఘనంగా సన్మానించారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ గుండేటి శ్రీనివాస్, ఎక్లాస్‌పూర్ పద్మశాలీ సంఘం గ్రామాధ్యక్షుడు ఆకుబత్తిని శ్రీనివాస్, నాయకులు గుండేటి వెంకటేశం, పద్మశాలీ కులస్తులు శాలువా కప్పి, శుభాకాంక్షలు తెలిపారు.